



విద్యుత్ వెలుగుల్లో దేవరపల్లి చర్చి

క్రిస్మస్ వెలుగులు


తాండూరు నజరేతు ప్రేయర్ చర్చి వద్ద అలంకరించిన పశువుల పాక


విద్యుత్ వెలుగుల్లో చర్చిలు


నేడు క్రిస్మస్

క్రిస్మస్ వేడుకలకు సిద్ధమైన వికారాబాద్ పట్టణంలోని చర్చి



మేడ్చల్ ప్రతినిధి/వికారాబాద్ ప్రతినిధి/ వికారాబాద్/ తాండూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ వేడుకలను బుధవారం సంబురంగా జరుపుకునేందుకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏర్పాట్లను సిద్ధం చేసుకున్నారు. చర్చిలు విద్యుత్ దీపాల అలంకరణంలో కాంతులీనుతున్నాయి. స్టార్స్, క్రిస్మస్ చెట్టును, పశువుల పాకను ప్రత్యేకంగా తయారు చేసి అలంకరించారు. క్రిస్మస్ తాత వేషధారణలతో చిన్నారులు సందడి చేశారు. చర్చిల వద్ద ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులు వేల సంఖ్యలో హాజరు కానున్న నేపథ్యంలో నిర్వాహకులు అన్ని సౌకర్యాలు కల్పించారు. మార్కెట్‌లో కేక్‌లు, క్రిస్మస్ ట్రీ, స్టార్స్ తదితర వస్తువుల అమ్మకాలు జోరందుకున్నాయి. ఇళ్ల ముందు స్టార్స్ ట్రీ ఏర్పాటు చేసుకోవడంతో పండగ వాతావరణం నెలకొంది. మంగళవారం అర్ధరాత్రి నుంచే వేడుకలను ప్రారంభించారు. కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు జరిపిన అనంతర ఒకరికొకరు కలిసి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. మేడ్చల్ జిల్లాలో ప్రధానంగా ఎస్‌టీ జోసఫ్ చర్చి, కింగ్స్ టెంపుల్, సీఎస్ఐ చర్చి, తాండూరు మార్వాడి బజార్‌లోని పురాతనమైన మెథడిస్టు చర్చిలను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. వికారాబాద్ పట్టణంలోని సెయింట్ జూడ్స్, మెథడిస్టు చర్చిలో ఉదయం పది గంటల నుంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు సన్నాహాలు చేశారు.


మేడ్చల్ ఉమానగర్‌లోని చర్చి


వేడుకలకు సిద్ధం చేసిన కేకు


మేడ్చల్ బాలాజీనగర్‌లో ముస్తాబైన చర్చి

క్రిస్మస్ శుభాకాంక్షలు



క్రిస్మస్‌ను ఆనందోత్సాహాల నడుమ జరుపుకోవాలి. క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు. జీసస్ జన్మదినాన్ని ప్రపంచ వ్యాప్తంగా ఉన్న క్రైస్తవులు ఎంతో పవిత్రంగా భావిస్తారు. సాటి మనుషుల పట్ల ప్రేమ, నిస్సహాయుల పట్ల కరుణ, శత్రువుల పట్ల క్షమ కలిగి ఉండాలని జీసస్ అందరికీ ప్రబోధించారు.

-కలెక్టర్ గౌతమ్, మేడ్చల్

గుండెపోటుతో వైద్య విద్యార్థిని మృతి


మేఘన (ఫైల్)

వికారాబాద్, డిసెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో వైద్య విద్యార్థి మృతి చెందిన సంఘటన వికారాబాద్ జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన నారిగల్ల మేఘన(19) వికారాబాద్ మహావీర్ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతోంది. సోమవారం సాయంత్రం కళాశాల ముగిసిన తరువాత కళాశాల ఆవరణలో స్నేహితులతో షెటిల్ ఆడుతున్న క్రమంలో ఒక్కసారిగా కింద పడిపోయింది. స్నేహితులు తోటి విద్యార్థులు వెంటనే మెడికల్ కళాశాల ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, తండ్రి బాబురావు వికారాబాద్ చేరుకుని విద్యార్థినిని మెరుగైన వైద్య కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందింది. పోలీసులకు సమాచారం అందడంతో కళాశాలకు వెళ్లి వివరాలు సేకరించారు.

ఒంటరి మహిళలే టార్గెట్

3 రాష్ట్రాల్లో 150పైగా చైన్ స్నాచింగ్‌లు



- వికారాబాద్ జిల్లాలో చైన్ స్నాచింగ్‌లతో పోలీసులు అప్రమత్తం
- సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితుడి గుర్తింపు
- కర్ణాటకలో అరెస్ట్..
- 10 తులాల బంగారం స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ నారాయణరెడ్డి

7



సమావేశంలో మాట్లాడుతున్న కౌకుంట్ల చంద్రారెడ్డి

నాగారం అభివృద్ధికి రూ.2.30కోట్లు

- మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి

7


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ నాయకులు

27నుంచి పూర్తిస్థాయి సమ్మె

- ఉద్యోగులపై ఒత్తిడి సమంజసం కాదు
- ఉద్యోగుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు గాంగ్యానాయక్
- డీఈవో, కలెక్టర్‌కు సమగ్ర శిక్ష ఉద్యోగుల నోటీసులు

7

ఇజ్తిమా ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల/శంకర్‌పల్లి డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): శంకర్‌పల్లిలో జనవరి 4, 5 తేదీల్లో నిర్వహించే ఇజ్తిమా గాహ్ కార్యక్రమ ఏర్పాట్లను మంగళవారం చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య, పలువురు కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. ఏర్పాట్లను పూర్తిచేయాలని, ఇజ్తిమాకు వచ్చే ముస్లింలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు.

రాత్రంతా కొనసాగిన విచారణ

- లంచం తీసుకుంటూ పట్టుబడిన అధికారులను ఏసీబీ కోర్టుకు తరలింపు
- తాండూరులోని అధికారుల ఇళ్లలో సోదాలు



విచారణకు తీసుకెళ్తున్న ఏసీబీ అధికారులు

తాండూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): తాండూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం రాత్రి రూ.5లక్షలు లంచం తీసుకుంటూ పట్టుబడిన కార్యాలయ అడ్మినిస్ట్రేషన్ అధికారి(ఏవో) దానయ్య, సీనియర్ అసిస్టెంట్ మాణిక్‌రావులను మంగళవారం ఏసీబీ కోర్టుకు తరలించారు. ఏసీబీ అధికారుల విచారణ మంగళవారం ఉదయం వరకు కొనసాగింది. రాత్రంతా సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సుదీర్ఘంగా విచారణ చేపట్టారు. తాండూరులో ఉన్న దానయ్య, మాణిక్‌రావుల ఇళ్లలో ఏసీబీ అధికారులు రాత్రంతా సోదాలు చేపట్టారు. కొడంగల్ నియోజకవర్గం దుద్యాల గ్రామశివారులోని సర్వేనంబర్-369 సంబంధించి ఆరు ఎకరాల భూమి పట్టా మార్పిడి విషయంలో లంచం తీసుకుంటూ పట్టుబడిన విషయం విదితమే. రాత్రి 6-45 నుంచి మంగళవారం ఉదయం 9గంటల వరకు ఏసీబీ అధికారులు తాండూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలోనే ఉండి విచారణ చేపట్టారు. ఏసీబీ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ విచారణ కొనసాగింది. ఏసీబీ అధికారులు బృందాలుగా ఏర్పడి దాడులను నిర్వహించారు. భూమార్పిడి కోసం డబ్బులు డిమాండ్ చేసిన వారిలో ఎవరి ప్రమేయం ఎంత ఉందన్న విషయంలో ఏసీబీ అధికారులు విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది. ఇంకా ఏమైనా ఇతర అవినీతికి పాల్పడ్డారా? అనే కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటన జిల్లా వ్యాప్తంగా ఉత్కంఠతో పాటు చర్చనీయాంశంగా మారింది. తాండూరు నియోజకవర్గంలో ఏసీబీ దాడులతో అధికారుల గుండెల్లో దడ పుట్టుకుంది. ఎక్కడ నలుగురు అధికారులు కలిసినా ఏ కార్యాలయంలో చూసినా ప్రస్తుత పరిస్థితులు బాగాలేవని, జాగ్రత్తగా ఉండాలని చర్చించుకున్నారు. అధికారులు అప్రమత్తమయ్యారు.



పామాయిల్ తోటను పరిశీలిస్తున్న రైతులు

మంత్రి పామాయిల్ తోట పరిశీలన

ధారూరు, డిసెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు పామాయిల్ తోటను మంగళవారం ధారూరు మండల రైతులు సందర్శించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వరావు పేటలో ఉన్న పామాయిల్ తోటను, సాగు విధానాన్ని వ్యవసాయ అధికారులు రైతులకు వివరించారు. పామాయిల్ తోటల సాగుకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని అధికారులు వివరించారు. రైతులతో పాటు జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి, ఏడీఏ వినోద్‌కుమార్, ఏవో సూర్యప్రకాశ్, ఏఈవో సంతోష్, రైతు సంఘం అధ్యక్షుడు ప్రవీణ్‌గౌడ్, రైతులు పాల్గొన్నారు.

పల్లె దవాఖానాలో నూతన పోలీస్‌స్టేషన్



పల్లె దవాఖానాలో ఏర్పాటు చేసిన తాత్కాలిక పోలీస్‌స్టేషన్

బొంరాస్‌పేట్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): దుద్యాల మండలంలో గత నెల 11న అధికారులపై జరిగిన దాడి ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో దుద్యాల మండలానికి ఇటీవలే అధికారులు నూతన పోలీస్ స్టేషన్‌ను మంజూరు చేశారు. అయితే ఈ పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణానికి స్థలపరిశీలన చేస్తున్న క్రమంలో తాత్కాలికంగా పల్లె దవాఖానాలో పోలీస్‌స్టేషన్ కోసం ఎంపిక చేశారు. ఈనెల 26న నూతన పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభించనున్నట్లు కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి మంగళవారం తెలిపారు. అదే విధంగా హకీంపేట్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాల భవన నిర్మాణానికి భూమి పూజ నిర్వహించనున్నట్లు తెలిపారు. తాత్కాలిక పీహెచ్‌సీ భవనం, హకీంపేట్‌లో ఉన్నత పాఠశాల, కళాశాల, ఐటీఐ కళాశాల కోసం భూమి పూజ చేయనున్నట్లు తెలిపారు. దీంతో పాటు మండల కాంప్లెక్స్ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

జిల్లాస్థాయి అథ్లెటిక్ పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ



సీఎం కప్ పోటీల్లో గెలుపొందిన ముజాహిద్‌పూర్ పాఠశాల

దోమ, కులకచర్ల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సీఎం కప్ పోటీల్లో భాగంగా నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్ పోటీల్లో జడ్పీహెచ్ఎస్ ముజాహిద్‌పూర్ పాఠశాల విద్యార్థినులు గెలుపొంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. 3000మీటర్ల రన్నింగ్ పోటీల్లో మనిషా ప్రథమ స్థానం, వి.నందిని రెండవ స్థానం సాధించారు, 800మీటర్ల రన్నింగ్ పోటీల్లో వి.అంకిత మొదటి స్థానం, గాయిత్రి రెండవ స్థానం సాధించారు. ఈనెల 31న హనుమకొండలో జరుగు రాష్ట్రస్థాయి పోటీలకు మనీషా, అంకిత ఎన్నిక కావడంతో వీరిని హెచ్ఎం జనార్దన్‌రెడ్డి, ఉపాధ్యాయులు రామదాసు, భాస్కర్, చక్రపాణి అభినందించారు.

అప్పోజిగూడను మున్సిపాలిటీలో విలీనం చేయాలి



ఎంపీడీవో సంధ్యకు వినతిపత్రం ఇస్తున్న అప్పోజిగూడ వాసులు

మొయినాబాద్ రూరల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మొయినాబాద్ కేంద్రంగా ఏర్పాటు కానున్న మున్సిపాలిటీలో తమ పంచాయతీని విలీనం చేయాలని అప్పోజిగూడ గ్రామస్తులు కోరుతున్నారు. ఈ మేరకు మంగళవారం ఎంపీడీవో సంధ్యరాణికి వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ.. ఆరేళ్ల కిందనే గ్రామాన్ని పంచాయతీగా ఏర్పాటు చేశారని, అప్పటి నుంచి గ్రామానికి ప్రభుత్వ నిధులు రావడం లేదన్నారు. తమ గ్రామాన్ని కూడా మున్సిపాలిటీలో కలిపితే అభివృద్ధి జరిగే అవకాశం ఉంటుందన్నారు.

ఉచిత వైద్యానికి ప్రైవేట్ ఆస్పత్రులు కృషి చేయాలి



మందులందజేస్తున్న దశరథ్‌నాయక్, వెంకటేశ్, తులసీరామ్

కడ్తాల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): గ్రామీణులకు ఉచిత వైద్యం అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు, ప్రైవేట్ ఆస్పత్రులు ముందుకురావాలని డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. మైసిగండిలో మంగళవారం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్, జె.రాధాకృష్ణ మెమోరియల్ ట్రస్ట్, గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ ఉప్పల అఖిల్, అనిల్, భావనలు 220 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్ తులసీరామ్, సేవ్యనాయక్, హరిచంద్, పాండు, రమేశ్, భీమ్లా, భీమ్‌లాల్, భాస్కర్, బిక్కు, మహేశ్‌గౌడ్, రాజు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం



సెమీ క్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

తలకొండపల్లి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): యేసుక్రీస్తు లోక రక్షకుడని, ఆయన లోకానికిచ్చిన సందేశం ఆదర్శనీయం అని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. దయ, సేవ, సమానత్వాన్ని ప్రబోధించిన క్రీస్తు మార్గం ఆచరణీయం అన్నారు. జెరుసాలేమ్ గాస్పెల్‌చర్చిలో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి పంచారు. ఆమనగల్లు ఏఎంసీ చైర్‌పర్సన్ యాట గీత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, ఏఎంసీ డైరెక్టర్లు అంజయ్యగుప్తా,అజీమ్, వెంకట్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, రవీందర్, డిగ్రీ కృష్ణ, నరేశ్, యాదగిరి పాల్గొన్నారు.

దూసకల్ గ్రామాన్ని సందర్శించిన ఒడిశా అధికారుల బృందం

షాద్‌నగర్ రూరల్, డిసెంబరు 24(ఆంధ్రజోతి): ఫరూఖ్‌నగర్ మండలం దూసకల్ గ్రామాన్ని మంగళవారం ఒడిశా రాష్ట్రానికి చెందిన అధికారులు, రైతులు సందర్శించారు. 30మంది అధికారులు, 30మంది రైతులు ఉద్యానవన పంటలను పరిశీలించారు. జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమశాఖ అధికారి సురేష్ బృందం సభ్యులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. సూక్ష్మ, బిందు సేద్యం.. ప్రభుత్వం నుంచి అందుతున్న సబ్సిడీ గూర్చి బృందం సభ్యులకు వివరించారు. రైతులు పంట పండించే విధానం, మార్కెటింగ్, ధరలు విషయాలపై అవగాహన కల్పించారు. కూరగాయల పంటలు పండించే పాలీ హౌజ్‌లను సందర్శించారు. ఆయిల్‌పామ్ కంపెనీ డీజీఎం రామ్మోహన్‌రావు, షాద్‌నగర్ హెచ్‌వో హిమబిందు, ఫీల్డ్ ఆఫీసర్లు రుక్మిణి పాల్గొన్నారు.

తెలుగులో మాట్లాడాలంటే ఒవైసీ అనుమతి కావాలా?


యు.రమేష్ కుమార్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

తాండూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): శాసన సభలో సీఎం తెలుగులో మాట్లాడాలంటే ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ అనుమతి అడగటం సిగ్గుచేటని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి శాసనసభలో హిందీలో మాట్లాడుతూ తెలుగులో మాట్లాడుతానని ఓవైసీని అనుమతి అడగడం చూస్తుంటే తెలంగాణ శాసన సభను ఎంఐఎం కాళ్ల దగ్గర మొకరిల్లేలా చేశారని విమర్శించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం గానీ, ప్రస్తుత రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కానీ ఎంఐఎం కనుసన్నల్లో నడుస్తున్నాయని ధ్వజమెత్తారు.

చిత్తాపూర్ టూ సికింద్రాబాద్ రైలు తాత్కాలికంగా రద్దు



తాండూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని చిత్తాపూర్ నుంచి ప్రారంభమై తాండూరు మీదుగా సికింద్రాబాద్‌కు వెళ్లే డెమో రైల్వేసర్వీస్ తాత్కాలికంగా నిలిపివేశారు. చిత్తాపూర్ (రైలు నంబర్ 07759) నుంచి ప్రారంభమయ్యే డెమో సర్వీస్ ఈనెల 29వరకు రద్దు చేశారు. అదేవిధంగా సికింద్రాబాద్ (రైలు నంబర్ 07760) నుంచి ప్రారంభమయ్యే సర్వీస్‌ను ఈనెల 28వరకు రద్దు చేశారు. ఎక్కడో కొనసాగుతున్న పుష్కరాలకు ఈరైలును రైల్వేశాఖ అధికారులు పంపించారు. పేదవర్గాలు ప్రయాణించేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉండే ఈ రైలు తాత్కాలికంగా రద్దు చేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. తాండూరు, రుక్మాపూర్ ధారూర్, గోదాంగూడ, వికారాబాద్, చిట్టిగడ్డ, శంకర్‌పల్లి స్టేషన్ల వరకు దినసరి కూలీలు, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, ఉద్యోగులు నిత్యం ఈ రైలులో ఉదయం, సాయంత్రం ప్రయాణించడానికి సౌకర్యవంతంగా ఉండేది.

అయ్యప్పలకు అన్నదానం చేసిన ముస్లిం నాయకుడు


అయ్యప్పలకు అన్నదానం చేస్తున్న ఎజాజ్

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మతాలు ఎన్నయినా మనుషులంతా ఒక్కటేనని, దేవుళ్లు వేరైనా భక్తి ఒక్కటేనని షాద్‌నగర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు మహమ్మద్ ఎజాజ్ చాటాడు. మంగళవారం అయ్యప్ప మాలధారులకు అన్నదానం చేశారు. గీతా అయ్యప్ప ఆలయంలో నిత్యాన్నదానంలో భాగంగా ఎజాజ్ స్వాములకు అన్న వితరణ చేశారు. రంజాన్‌లో ముస్లింలకు హిందువులు ఇఫ్తార్, అయ్యప్పలకు ముస్లింలు భిక్ష ఇస్తూ పోతే మతాలకతీతంగా అందరం కలిసి ఉంటామని ఎజాజ్ అన్నారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ గణేష్, నాయకులు ఒగ్గు కిషోర్, జీటీ. శ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

నాగారంలో వైభవంగా బోనాలు


నాగారంలో తుల్జాభవానీకి బోనాలు సమర్పిస్తున్న మహిళలు

ధారూరు, డిసెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగారం గ్రామంలో ఈనెల 22 నుంచి ప్రారంభమైన శ్రీ తుల్జాభవానీ మాత జాతర మహోత్సవం కార్యక్రమాల్లో భాగంగా మూడవ రోజు మంగళవారం సాయంత్రం గ్రామ దేవతలు మామిళ్ల ఎల్లమ్మ దేవతకు బోనాల జాతరను నిర్వహించారు. మధ్యాహ్నం గుడికి చేరుకున్న మహిళలు మామిళ్ల ఎల్లమ్మ గుడికి బోనాలతో చేరుకుని అమ్మవారికి నైవేద్యాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు నరోత్తంరెడ్డి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

మహిళలకే సౌరశక్తి యూనిట్లు



మహేశ్వరం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి):సోలార్ పవర్ యూనిట్లను మహిళా సంఘాలకే అప్పగించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని మహేశ్వరం కాంగ్రెస్ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం తుక్కుగూడలోని కాంగ్రెస్ కార్యాలయంలో సిరిగిరిపురం రైతులతో మాట్లాడారు. ఐదు జిల్లాల్లో ఈ పథకాన్ని పైలెట్ ప్రాజెక్టుగా 231 ఎకరాల్లో ఏర్పాటుకు భూసేకరణను వేగవంతం చేసిందన్నారు. సిరిగిరిపురంలో ప్రభుత్వ, సీలింగ్ భూముల్లో ప్రభుత్వ మెడికల్/నర్సింగ్ కాలేజీలు, సాఫ్ట్‌వేర్ కంపెనీల ఏర్పాటుకు ప్రభుత్వ ఉత్తర్వులు జారీ అయ్యాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, ఇజ్రాయిల్, కూన యాదయ్య, జంగారెడ్డి, రఘుపతి, కాకి ఈశ్వర్, రైతులు పాల్గొన్నారు.

27నుంచి పూర్తిస్థాయి సమ్మె

డీఈవో, కలెక్టర్‌కు సమగ్ర శిక్ష ఉద్యోగుల నోటీసులు

వికారాబాద్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్ల సాధన కోసం 27నుంచి పూర్తి స్థాయిలో సమ్మెలోకి వెళ్తున్నామంటూ మంగళవారం కేజీబీవీ, యూఆర్ఎస్, సమగ్ర శిక్ష ఉద్యోగులు డీఈవో రేణుకాదేవి, కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు వినతిపత్రాలు అందజేశారు. 18 రోజులుగా నిరవధిక సమ్మె నిర్వహిస్తున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో పోరాటాన్ని ఉధృతం చేయాలని నిర్ణయించినటు జేఏసీ జిల్లా అధ్యక్షుడు గాంగ్యానాయక్ తెలిపారు. తమ డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరిస్తుందని తమకు నమ్మకం ఉందన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసీ బాధ్యులు శ్రీకాంత్, రవికుమార్, ప్రభావతి, రాజేశ్వరి, స్రవంతి, పల్లవి, రాధిక, సునీత, సోఫియా తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులపై ఒత్తిడి సమంజసం కాదు

వికారాబాద్: సమ్మెలో ఉన్న సమగ్ర శిక్ష ఉద్యోగుల మీద అధికారుల ఒత్తిడి సమంజసం కాదని, ఒత్తిడి చేస్తే అధికారుల ఇంటి ఎదుట ఆత్మహత్య చేసుకుంటామని ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గంగ్యానాయక్ తెలిపారు. మంగళవారం ఉద్యోగుల సమ్మె 18వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న మండలాల విద్యాధికారులు మానత్వం మరిచి సీసీవోలకు యంఐఎస్‌లకు ఫోన్ చేసి బెదిరింపులకు గురి చేస్తున్నారని ఇది సరికాదన్నారు. కార్యక్రమంలో శేఖర్, శైలజా, ఫాతిమా, చంద్రశేఖర్, మోహన్, అనితా, రఘు, రవి, పాండు రంగయ్య, అరుంధతి, నీరజ, ఎక్కువ సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

జాతీయ వ్యవసాయ కమిటీ విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలి

రంగారెడ్డి అర్బన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): జాతీయ వ్యవసాయ కమిటీ విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు మాధవరెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రభులింగం డిమాండ్ చేశారు. సంయుక్త కిసాన్‌మోర్చా పిలుపుమేరకు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఏవో సునీల్‌కు వినతిపత్రం ఇచ్చారు. రైతు నాయకుడు జగత్‌సింగ్ దిల్వాలే నిరాహార దీక్ష చేస్తున్నా.. అతడిని నిరాహార దీక్ష నుంచి కాపాడి ఢిల్లీకి పాదయాత్ర చేస్తున్న రైతులపై అణిచివేతను ఆపాలని మాండ్ చేశారు. రైతు సంఘం నాయకులు చల్లా నారాయణరెడ్డి, ఎస్.బాల్‌రెడ్డి, బాలరాజ్, శివానందం పాల్గొన్నారు.

ఒంటరి మహిళలే టార్గెట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

3 రాష్ట్రాల్లో 150పైగా చైన్ స్నాచింగ్‌లు

- వికారాబాద్ జిల్లాలో చైన్ స్నాచింగ్‌లతో పోలీసులు అప్రమత్తం
- సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితుడి గుర్తింపు
- కర్ణాటకలో అరెస్ట్..
- 10 తులాల బంగారం స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, డిసెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): ఒంటరిగా ఉన్న మహిళలనే టార్గెట్ చేసి వారి మెడలో ఉన్న చైన్‌లే లక్ష్యంగా మూడు రాష్ట్రాల్లో వరుసగా దొంగతనాలు చేస్తున్న అంతర్ రాష్ట్ర చైన్ స్నాచర్‌ను వికారాబాద్ పోలీసులు అరెస్ట్ చేసినట్లు ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం ఎస్పీ కార్యాలయంలో చైన్ స్నాచర్ కు సంబంధించిన వివరాలను విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వికారాబాద్ జిల్లాలోని బొంరాస్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో సెప్టెంబర్ 20న 2.5 తులాల బంగారం గొలుసు దొంగతనం, 22న కుల్కచర్లలో 2.5 తులాల బంగారం చోరీ, అదే రోజు సాయంత్రం వికారాబాద్ జిల్లా కేంద్రంలో శివరాంనగర్‌లో చైన్ స్నాచింగ్ ఇలా వరుస దొంగతనాలు నమోదు కావడంతో చాలెంజ్‌గా తీసుకొని దర్యాప్తు చేపట్టారు. సీసీఎస్ పోలీసులు సీఐ బలవంతయ్య బృందం.. సీసీ కెమెరాలు, టెక్నాలజీ ఆధారంగా నిందితుడు హైదరాబాద్‌కు చెందిన ఎండీ జావిద్‌గా గుర్తించారు. అతడు కర్ణాటక ప్రాంతంలో ఉంటూ పదేళ్లలో 150కిపైగా చైన్‌స్నాచింగ్‌లు చేసినట్లు గుర్తించారు. ఆయనతో పాటు మైనర్ యువకులను వెంట తీసుకొచ్చి మహిళలను టార్గెట్ చేసి బంగారు గొలుసులను ఎత్తుకెళ్లడం అతడి అలవాటు. వీళ్లు గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలను సేవించి తమ దగ్గర పెప్పర్ స్ప్రే, వేట కొడవలిని వెంటపెట్టుకునే వారని, వీరు వాకింగ్ చేసే మహిళలను ఆరు బయట కూర్చున్న మహిళను, కిరాణా కొట్టులలో ఉన్న మహిళలనే లక్ష్యంగా చేసుకుంటారన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకే దొంగతనాలకు పాల్పడుతారన్నారు.

మొత్తం 150 కేసులు

ప్రతి సారి అతని వెంబడి ఆరిఫ్, మేరాజ్, అర్షాద్, రషీద్ పటేల్, ఆఫ్రోజ్, వజీద్, సమీర్, రఫూఫ్, అర్బస్‌లలో ఎవరినైనా ఒకరిని తోడుగా తీసుకొని వచ్చి నేరాలకు పాల్పడుతుంటాడు. ఏ1 నిందితుడి పైన కర్ణాటక, తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ సైబరాబాద్, రాచకొండ , ఆదిలాబాద్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, మెదక్ రంగారెడ్డి జిల్లాలలో మొత్తం 150 కేసులు నమోదయ్యాయి. దొంగతనాలు చేసి ఫోన్లు స్విచ్‌ఆఫ్ చేసి టెక్నాలజీని ఉపయోగించుకొని తప్పించుకుంటున్నారు. బీదర్ కోర్టులో, ఎన్‌బీఎం పెండింగ్‌లో ఉందన్నారు. వికారాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన చైన్ స్నాచింగ్ కేసులో వికారాబాద్ సీసీఎస్ పోలీసు అధికారులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 10 తులాల బంగారం, రెండు పెప్పర్ స్ప్రేలు, వేట కొడవలిని స్వాధీనం చేసుకున్నారు. కేసును చేధించిన పోలీసు అధికారులు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు బలవంతయ్య, అన్వర్ పాషా, పోలీస్ అధికారులు చెన్నయ్యగౌడ్, జయవర్ధన్, శివకుమార్, క్రిష్ణరెడ్డి, రాఘవేందర్ రెడ్డి, అంజప్ప రామకృష్ణలకు రివార్డ్స్ ఇవ్వనున్నట్లు ఎస్పీ తెలిపారు.

ఇళ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి


మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

మూడుచింతలపల్లి, డిసెంబర్ 24, (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల సర్వేను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని మేడ్చల్- మల్కాజిగిరి కలెక్టర్ గౌతమ్ పోట్రు అన్నారు. మంగళవారం మూడుచింతలపల్లి మండలంలోని లక్ష్మాపూర్, లింగాపూర్ తండా గ్రామాల్లో పర్యటించి ఇందిరమ్మ ఇళ్ల సర్వే నమోదు ప్రక్రియ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సర్వే నిర్వహిస్తున్న అధికారులు దరఖాస్తుదారు ల వివరాలను తప్పులు లేకుండా సేకరించి మొబైల్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. సమస్యలు ఏమైనా ఉన్నాయా? అని కలెక్టర్ అధికారులను అడగ్గా యాప్ చాలా స్లోగా ఉందని ఫొటోలు సేవ్ చేయడానికి సమయం పడుతుందని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటనర్సింహారెడ్డి ఆర్అండ్‌బీ ఈఈ శ్రీనివాసమూర్తి, ఎంపీడీవో వత్సాలాదేవి, పంచాయితీ కార్యదర్శి శోభా, నాయకులు జగన్నాధం, గోపి పాల్గొన్నారు.

న్యాయం చేకూర్చేలా అవగాహన కల్పించాలి


మాట్లాడుతున్న లింగ్యానాయక్

వికారాబాద్, డిసెంబర్ 24 (ఆంధ్రజ్యోతి) : డిజిటల్ విధానం, వర్చువల్ విచారణ ద్వారా వినియోగదారులకు న్యాయం చేకూర్చేలా అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ప్రతి సంవత్సరం డిసెంబర్ 24న జరుపుకునే జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ పౌరునికి వినియోగదారుల హక్కుల గురించి తెలియజేసే దిశగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పౌర సరఫరాల అధికారి మోహన్ బాబు, జిల్లా మేనేజర్ విజయలక్ష్మి, ఎస్సీడబ్ల్యూడీవో మల్లేశం, తూనికలు కొలతల శాఖ జిల్లా అధికారి రియాజ్, చౌక ధరలు దుకాణాల సంఘం జిల్లా అధ్యక్షుడు జూకారెడ్డి, గ్యాస్ ఏజెన్సీ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో శాంతి

- సీబీఐ మాజీ డైరెక్టర్ డాక్టర్ కార్తికేయన్
- కొనసాగుతున్న 'ధ్యాన మహాయాగం'


మాట్లాడుతున్న డాక్టర్ కార్తికేయన్, పక్కన శ్రీరామ చంద్ర మిషన్ గురూజీ కమలేశ్ డి పటేల్



ఆమనగల్లు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): సమాజ శాంతికి, మానవ సన్మార్గ పురోగమనానికి ధ్యానం, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని సీబీఐ మాజీ డైరెక్టర్ డాక్టర్ కార్తికేయన్, శ్రీరామచంద్ర మిషన్ గురూజీ కమలేశ్ డి పటేల్ అన్నారు. కడ్తాల మండలం అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలోని కైలాసపురి మహేశ్వర మహాపిరమిడ్‌లో ధ్యాన మహాయాగం వేడుకలు-3 అట్టహాసంగా కొనసాగుతున్నాయి. మంగళవారం 4వ రోజు తెలుగు రాష్ట్రాలతో పాటు, దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ధ్యానులు, సాధ కులు, సందర్శకులు, పిరమిడ్ మాస్టర్లు, ఆధ్యాత్మిక వేత్తలు పెద్దసంఖ్యలో వేడుకలకు తరలివచ్చారు. వరుస సెలవు దినాల నేపథ్యంలో భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా కార్తికేయన్, గురూజీ కమలేశ్ డి పటేల్‌లు హాజరై ప్రసంగించారు. ప్రతీ ఒక్కరు ధ్యానం చేయాలని, ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని సూచించారు. అలాగే సుభాష్ పత్రీజీ కూతురు పరిణితి పత్రీజీ, ట్రస్ట్ చైర్మన్ కోర్పోలు విజయభాస్కర్‌రెడ్డిలు మాట్లాడుతూ ధ్యానం సర్వరోగ నివారిణి, సత్యజ్ఞాన ప్రసాదిని అని అన్నారు. వేడుకల్లో భాగంగా తెల్లవారుజామున 5గంటల నుంచి 8గంటలకు సామూహిక ప్రాతఃకాలం సంగీత ధ్యానం నిర్వహించారు. పత్రీజీ వీడియో సందేశాలను ప్రదర్శించా రు. సామూహిక ధ్యానంలో ధ్యా నులు లీనులయ్యారు. కడ్తాల మండలం మహేశ్వర పిరమిడ్ కేంద్రంగా భారత్‌లో మొదలైన ధ్యాన, శాఖాహార విప్లవం విశ్వవ్యాప్తం చేయాలని.. ధ్యాన మాస్టర్లు కంకణబద్దులు కావాలని పిలుపు నిచ్చా రు. ట్రస్ట్ సభ్యులు సాంబశివరావు, హన్మంతరావు, మాధవి, దామోదర్‌రెడ్డి, లక్ష్మి, అన్మాస్‌పల్లి మాజీ సర్పంచ్ శంకర్, పీఎస్ఎస్ఎం అధ్యక్షులు సరోజ, సంగమేశ్వర్, గణేశ్, దీప్తి, అనురాధ, మారం శివప్రసాద్, సీఐ శివప్రసాద్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ధ్యానమహాయగంలో భాగంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరిస్తున్నాయి. అలాగే ఆధ్యాత్మిక వేత్తల ప్రసంగాలు ఆకట్టుకుంటున్నాయి. ధ్యాన, శాఖాహార విలువల గుర్చి పలువురు పిరమిడ్ మాస్టర్లు ధ్యాన వేడుకల్లో వివరించి అవగాహన కల్పిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, ఆధ్యాత్మిక వేత్తలు కూడా పిరమిడ్‌ను సందర్శించి ధ్యానమహాయాగంలో పాల్గొంటున్నారు. పలు ప్రాంతాల కల్చరల్, అకాడమీలకు చెందిన కళాకారుల నృత్యాలు, కళాప్రదర్శనలు అమితంగా ఆకట్టుకున్నాయి. చిన్నారులు, యువతులు, కళాకారుల నృత్యరూపకాలు, భరత నాట్యాలు, కూచిపూడి నృత్యాలు అదరహో అనిపించాయి.

ఆధ్యాత్మిక పుస్తకాల ఆవిష్కరణ

పత్రీజీ ధ్యాన మహాయాగంలో భాగంగా పిరమిడ్ సభా ప్రాంగణంలో పలు ధ్యాన, ఆధ్యాత్మిక పుస్తకాలను పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ కోర్పోలు విజయభాస్కర్‌రెడ్డి, పత్రీజీ కూతురు పరిణితి పత్రీజీ ఆవిష్కరించారు. ధ్యాన విలువలు చాటుతూ పుస్తకాలను వెలువరిస్తున్న రచయితలను ఈ సందర్భంగా వారు అభినందించారు. అదేవిధంగా పలు ధ్యాన కేంద్రాల ద్వారా రూపొందించిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు.

నాణ్యమైన వైద్య సేవలందించాలి


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రఘునాథస్వామి

మేడ్చల్ ప్రతినిధి, డిసెంబర్ 24(ఆంధ్రజ్యోతి): బస్తీ దవఖానాల ద్వారా ఆరోగ్య సంరక్షణను బలోపేతం చేసేందుకు నాణ్యమైన సేవలనందించాలని డీఎంహెచ్‌వో రఘునాథస్వామి సూచించారు. జిల్లాలో కొత్తగా నియమించబడిన మెడికల్ ఆఫీసర్లకు మంగళవారం కలెక్టరేట్‌లో ఓరియెంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మెడికల్ ఆఫీసర్లను బస్తీ దవాఖానాల కార్యాచరణ, అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. ఓపీ సేవలు, తక్షణ వైద్య సేవలను అందించడంలో , సేవల దృష్టి కలిగి ఉండా పనివేళల ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో జిల్లా టీకాల అధికారి సరస్వతి, జిల్లా ప్రోగ్రామ్ అధికారి రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ ప్రారంభోత్సవానికి రండి

- ఆరోగ్యశాఖ మంత్రిని ఆహ్వానించిన డీఎంహెచ్‌వో


ఆరోగ్య శాఖ మంత్రితో డీఎంహెచ్‌వో

వికారాబాద్, డిసెంబర్ 24(ఆంధ్రజ్యోతి): హకీంపేటలో నూతనంగా ప్రారంభిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వేడుకలకు రావాలని డీఎంహెచ్‌వో వెంకటరమణ ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను ఆహ్వానించారు. మంగళవారం కలెక్టర్ సూచన మేరకు మంత్రిని, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను కలిసి ఆహ్వానించారు. డీఎంహెచ్‌వో వెంట వైద్య అధికారి శ్రీనివాసులు ఉన్నారు.

అమిత్‌షా అహంకారానికి బుద్ధి చెప్పాలి

డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి


అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

రంగారెడ్డి అర్బన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అమిత్‌షా అహంకారానికి దేశ ప్రజలు బుద్ధి చెప్పాలని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. ఏఐసీసీ, పీసీసీ పిలుపు మేరకు మంగళవారం ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొంగరకలాన్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు, ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టరేట్ వరకు ర్యాలీగా తరలి కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. చల్లా మాట్లాడుతూ అమిత్‌షా అబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలు సరికాదని, ఆయనను కేంద్ర మంత్రివర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ అహంతో మాట్లాడిన అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి కొండ్రు పుష్పలీల మాట్లాడుతూ అంబేడ్కర్‌ను అవమానపర్చిన అమిత్‌షాను రాజకీయంగా తొక్కిపడేయాలన్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, రాష్ట్ర పొల్యూషన్ బోర్డు మెంబర్ సత్యనారాయణరెడ్డి, కార్పొరేషన్ చైర్మన్లు మల్‌రెడ్డి రాంరెడ్డి, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ హరినాథ్‌రెడ్డి, చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి భీంభారత్, నాయకులు గౌరీసతీష్, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, రామోహన్‌గౌడ్, చిలుక మధుసూధన్‌రెడ్డి, ఏనుగు జంగారెడ్డి, మహిళా కాంగ్రెస్ నాయకురాలు సులోచన, మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, మాజీ జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, ఎన్ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అమిత్ షాను బర్తరఫ్ చేయాలి

ఆమనగల్లు/షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రాజ్యసభలో డాక్టర్ అంబేడ్కర్‌ను కించపరిచేలా మాట్లాడిన కేంద్రం హోమ్ మంత్రి అమిత్‌షాను మంత్రిమండలి నుంచి బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఏఐసీసీ పిలుపుకు మేరకు అంబేడ్కర్ సమ్మాన్ సప్తాహ్ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. మంగళవారం పార్టీ నిర్వహించిన కార్యక్రమంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొన్నారు. అంబేడ్కర్‌ను అవమానించిన అమిత్ షాను పదవి నుంచి కేంద్ర ప్రభుత్వం తొలగించాలని కోరుతూ ఎమ్మెల్యే, కాం గ్రెస్ నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. నాయకులు బాలాజీసింగ్, ఆయిళ్ల శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు. అమిత్‌షాపై చర్య తీసుకోవాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద చేపట్టిన ధర్నాలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అంతకు ముందు షాద్‌నగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అమిత్ షాపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శంకర్ డిమాండ్ చేశారు.

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

మహేశ్వరం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం డీలర్ల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పులిమామిడి లక్ష్మీనారాయణగౌడ్ ఆధ్వర్యంలో డీలర్లు పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం ఇచ్చారు. లక్ష్మీనారాయణగౌడ్ మాట్లాడుతూ డీలర్లకు గౌరవ వేతనం రూ.10వేలు, ప్రతీ క్వింటాలుకు రూ.3వందల కమీషన్ ఇవ్వాలన్నారు. ఎంఎల్ఎస్ పాయింట్ల బియ్యాన్ని వేబ్రిడ్జిల వద్ద తూకం వేయకుండా పంపడంతో ఒక్కో షాపునకు ప్రతీనెల 2 నుంచి 3 క్వింటాళ్ల బియ్యం షార్టేజ్ వస్తోందన్నారు. బియ్యం బస్తాలతో వస్తున్న దుమ్ము, ధూళితో డీలర్లు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కరోనా సమయంలో రాష్ట్రంలో 149మంది డీలర్లు చనిపోయారని, వారి కుటుంబాలకు ప్రభుత్వం ఏ సాయం చేయలేదని, కనీసం కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఆదుకోవాలన్నారు. డీలర్ల సమస్యలన్నీ సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని మహేష్‌కుమార్‌కుమార్‌గౌడ్‌కు విన్నవించారు. సమస్యలు విన్న పీసీసీ చీఫ్ స్పందించి దీనిపై త్వరలో ముఖ్యమంత్రితో మాట్లాడుతానని హామీ ఇచ్చినట్లు సంఘం నాయకులు తెలిపారు.

నాగారం అభివృద్ధికి రూ.2.30కోట్లు



సమావేశంలో మాట్లాడుతున్న కౌకుంట్ల చంద్రారెడ్డి

కీసర రూరల్, డిసెంబర్ 24(ఆంధ్రజ్యోతి): నాగారం మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు రూ.2.30 కోట్లను కేటాయిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగారం పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా మారిన అనంతరం తొలిసారిగా ఏర్పాటైన పాలకవర్గం ఆయా వార్డుల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేసినట్లు వెల్లడించారు. కోట్లాది రూపాయలు వెచ్చించి కాలనీల్లో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను చేపట్టినట్లు వివరించారు. అందులో భాగంగా దాదాపు చివరి సమావేశంలో 20వార్డుల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకుగాను రూ.2.30 కోట్లను కేటాయిస్తూ కౌన్సిల్ ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు చెప్పారు. ఐదేళ్లుగా తనకు సహకరించిన పాలకవర్గానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ మల్లేష్‌యాదవ్, కమిషనర్ భాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



కీసర: రాంపల్లి దాయరలోని జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో క్రిస్మస్ వేడుకలు

తాండూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. చైర్‌పర్సన్ స్వప్న తన చాంబర్‌లో కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ విక్రం సింహారెడ్డి, డీఈ మణిపాల్, మేనేజర్ నరేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు ప్రభాకర్ గౌడ్, మాజీ కౌన్సిలర్ జుబేర్ లాల, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

కొడంగల్: కొడంగల్ పట్టణంలోని కేఎస్‌వీ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. నియోజకవర్గంలోని క్రైస్తవ సోదరులకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన విందులో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అధికారులు కేక్ కట్‌చేసి క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన క్రీడల జిల్లా అధికారి హన్మంత్‌రావు, తహసీల్దార్ విజయ్‌కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్లు రాజేశ్‌రెడ్డి, వార్ల విజయ్‌కుమార్, యూత్ కాంగ్రెస్ జాతీయ కోఆర్డినేటర్ కృష్ణంరాజు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు ప్రశాంత్, నర్సింహులు గౌడ్, ఆనంద్‌రెడ్డి, సంజీవ్‌రెడ్డి, బాల్‌రెడ్డి, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

కులకచర్ల: మండల కేంద్రంలో మంగళవారం జేకేఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రిస్మస్ పండుగ సందర్భంగా చర్చి పాస్టర్లకు కేకులు అందజేశారు.



కులకచర్ల: జేకేఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కేకులు అందజేస్తున్న సభ్యులు

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అనుచరులు ఈ సందర్భంగా క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో క్రిస్మస్ పండగను పురస్కరించుకొని చర్చిలను విద్యుద్దీపాలతో ముస్తాబుచేశారు. టేకులపల్లి, మొరంగపల్లి, దేవరంపల్లి మేకవనంపల్లి, మోమిన్‌పేట్, అమ్రాదికలాన్, అమ్రాదికుర్దు, కేసారం తదితర గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది.

కీసర: మండలంలోని రాంపల్లి దాయరలోని జూబ్లీ హిల్స్ పబ్లిక్ స్కూల్‌లో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు ఆట, పాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ పద్మజా, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుద్దీపాలతో చర్చిలు ముస్తాబు

పరిగి: పరిగి పట్టణంలోని చర్చిలు నేడు(బుధవారం) నిర్వహించనున్న క్రిస్మస్ వేడుకలకు ముస్తాబయ్యాయి. ప్రభుత్వమే అధికారికంగా క్రిస్మస్ వేడుకలను నిర్వహిస్తోంది. పరిగితోపాటు, పరిసర గ్రామాల్లో గత రెండు, మూడు రోజుల నుంచి కోలాహలం ప్రారంభమైంది. పరిగి పట్టణంలో ఉన్న యేసు నిలయం, ప్రేంనగర్‌కాలనీలో మెథడిస్ట్, టీచర్స్‌కాలనీలో క్యాథలిక్ హోం చర్చిల్లో లైట్లు, రంగురంగుల దీపాల మెరుగులతో మెరుస్తున్నాయి. అదేవిధంగా మండలంలోని తుంకులగడ్డ, రాఘవాపూర్, సుల్తాన్‌నగర్, ఎర్రగడ్డపల్లి,నారాయణపూర్, సుల్తాన్‌పూర్, యాబాజీగూడ, పెద్దఉమ్మెంతాల్, చిగురాల్‌పల్లి గట్టుపల్లి, మంచన్‌పల్లి, మరియాపూర్ తదితర గ్రామాల్లోని చర్చిలను కూడా అలంకరించారు.

తాండూరు రూరల్: క్రిస్మస్ వేడుకలకు చర్చిలు ముస్తాబయ్యాయి. మండల పరిధిలోని అంతారం, జినుగుర్తి, ఐనెల్లి తదితర గ్రామాల్లో చర్చీలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. చర్చీల్లో స్టార్స్, క్రిస్మస్ ట్రీలు రకరకాల అలంకరణలు చేశారు.

పూడూరు: క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని మండలంలోని చెన్‌గోముల్ ఎస్‌ఐ మధుసూదన రెడ్డి క్రిస్టియన్లకు శుభాకాంక్షలు తెలిపారు.



కొడంగల్: సెమీ క్రిస్మస్ వేడుకల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు



తాండూరు రూరల్: అంతారంలో విద్యుద్దీపాలతో ముస్తాబైన చర్చి



కొడంగల్: దేవరంపల్లిలో క్రిస్మస్ సందర్భంగా ముస్తాబైన చర్చి

క్రైం కార్నర్

విద్యుత్ వైర్లు అపహరణ

మూడుచింతలపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఓషాపులో లక్షలు విలువచేసే విద్యుత్ వైర్లు చోరీకి గురయ్యాయి. ఈఘటన శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం వెలుగుచూసింది. మండల కేంద్రంలో విష్ణురెడ్డి శ్రీబాలాజీ ట్రేడర్స్ హార్డ్‌వేర్ షాపు నడిపిస్తున్నారు. మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు షెటర్ తాళం విరగ్గొట్టి లోపలికి చొరబడ్డారు. దాదాపు 3లక్షల విలువ చేసే సుధాకర్ వైర్ బెండల్స్‌ను, సామగ్రి, సీసీకెమరా హార్డ్ డిస్క్‌ను అపహరించుకెళ్లారు. ఈ విషయాన్ని గమనించి నిర్వాహకుడు పోలీసులకు సమాచారం అందించగా ఘటనాస్థలాన్ని పోలీసులు, క్లూస్‌టీమ్ పరిశీలించి కేసు దర్యాప్తు చేపడుతున్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపిన ముగ్గురికి జైలుశిక్ష

నవాబుపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపిన ముగ్గురికి జైలు శిక్ష విధించినట్లు నవాబుపేట ఎస్‌ఐ అరుణ్‌కుమార్ తెలిపారు. వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా సోమవారం రాత్రి ముగ్గురు వ్యక్తులు మండలంలోని కేశపల్లి గ్రామానికి చెందిన వడ్డె చెన్నయ్య, మెదక్‌జిల్లా కొండాపూర్ మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన శివకుమార్, ఆర్కతల గ్రామానికి చెందిన తలారి రాములు మద్యం సేవించి పట్టుబడినట్లు తెలిపారు. ముగ్గురిని అదుపులోకి తీసుకొని మంగళవారం కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి ఒక రోజు జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే కాలే యాదయ్య

నవాబుపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య మంగళవారం నవాబుపేట మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 85 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జయరాం, డిప్యూటీ తహసీల్దార్ శ్రీలత, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మేడిపల్లి వెంకటయ్య, మధుసూదన్‌రెడ్డి, పోలీస్ రామ్‌రెడ్డి, నాగిరెడ్డి, నర్సింహారెడ్డి, ఖదీర్, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

అమిత్‌షాను మంత్రి పదవి నుంచి తొలగించాలి



బషీరాబాద్: అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు



వికారాబాద్: కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు



యాలాల: నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వికారాబాద్, డిసెంబర్ 24 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర మంత్రి అమిత్‌షాను మంత్రి పదవి నుంచి తొలగించాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పార్లమెంట్ సమావేశంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ అధిష్ఠానం ఆదేశాల మేరకు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ సూచనలతో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు నిరసన తెలిపారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ రాజేష్‌రెడ్డి, కాంగ్రెస్ యువజన అధ్యక్షుడు సతీష్‌రెడ్డి, పరిగి మార్కెట్‌చైర్మన్ పరశురాంరెడ్డి, ఆంజనేయులు, రత్నారెడ్డి, అనంత్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, కృష్ణ, శంకర్, సురేందర్ ముదిరాజ్, నర్సింగ్ నాయక్, మురళి, వేణుగోపాల్ రెడ్డి, చందర్‌నాయక్, ముక్తార్ షరీఫ్, శ్రీనివాస్ ముదిరాజ్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

తాండూరు రూరల్: అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని కాంగ్రెస్ నాయకులు అన్నారు. తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని మల్కాపూర్‌లో మంగళవారం అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అమిత్‌షా వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గని కార్మిక సంఘం చైర్మన్ పండరి, డైరెక్టర్ వడ్ల మల్లేశం, బోయిని నర్సింహులు, మౌలానా, మాజీ ఉపసర్పంచ్ అబ్దుల్ మజీద్, కొల్లి ఎల్లప్ప, షైనుద్దీన్, మోహన్‌గౌడ్, జె.శ్రీశైలం, పండరిచారి, మ్యాతరి నర్సింహులు, రమేష్, సాయిలు, గుండప్ప పాల్గొన్నారు.

యాలాల: తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆదేశాలతో యాలాలలో మండల కాంగ్రెస్ నాయకులు అంబేడ్కర్ విగ్రహం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అంబేడ్కర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కాంగ్రెస్ పార్టీ యాలాల మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో ఒక అత్యున్నత పదవిలో ఉండి అంబేడ్కర్‌ను కించపరచడం అమిత్‌షాకు తగదన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి అమిత్‌షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యాలాల పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు భీమయ్య, కో-ఆప్షన్ సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు అక్బర్ బాబా, చిన్నారం అనిల్‌కుమార్, జక్కపల్లి అమృతయ్య తదితరులు పాల్గొన్నారు.

బషీరాబాద్: మండలంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కలాల్ నర్సింహులుగౌడ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు పలువురు నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి అమిత్‌షా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్‌ను కించపరిచే విధంగా పార్లమెట్‌లో వాఖ్యలు చేయడం దారుణమన్నారు. అనంతరం అంబేడ్కర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ జి.మాధవరెడ్డి, సొసైటీ వైస్‌చైర్మన్ అజయ్‌ప్రసాద్, రామునాయక్, శ్రీనివాస్, మహేందర్‌రెడ్డి, సత్యం, మాణిక్‌రావు న్నారు.

పరిగి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కించపరుస్తూ మాట్లాడిన కేంద్రమంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం పరిగిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వికారాబాద్‌కు వెళ్లి కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. డీసీసీ ప్రధానకార్యదర్శి కె.హన్మంత్‌ముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు కృష్ణ, పరిగి, కులకచర్ల ఎఎంసీ చైర్మన్లు బి.పరుశరాంరెడ్డి, బీఎస్ అంజనేయులు, సత్యనారాయణ, అయూబ్, ఎన్.రామకృష్ణ, ఆంజనేయులు, తావుర్యానాయక్ పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్: కొడంగల్ అంబేడ్కర్ చౌరస్తాలో జాతీయ బహుజన సమాజ్ పార్టీ అధ్యక్షురాలు బెహంజీ మాయావతి గారి పిలుపుమేరకు వివిధ ప్రజాసంఘులు, అంబేడ్కర్ సంఘల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. అంబేడ్కర్‌పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలను ఖండించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దస్తప్ప, లింగం సాయిలు, కృష్ణ, సాయిలు, చిన్నయ్య, శేఖర్, పవన్ పాల్గొన్నారు.

తాండూరు రూరల్: అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు





పరిగి: అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులు



కొడంగల్ రూరల్: అంబేద్కర్ చౌరస్తాలో బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేస్తున్న వివిధ సంఘల నాయకులు

పార్కు స్థలాన్ని కాపాడాలి



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కాలనీవాసులు

మేడ్చల్ టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని శ్రీనివాస నగర్ కాలనీలో అన్యాక్రాంతమైన పార్కు స్థలాన్ని రక్షించాలని కోరుతూ కాలనీవాసులు స్థానిక కౌన్సిలర్ మానస శ్రవణ్‌కుమార్ గుప్తతో కలిసి మంగళవారం మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డికి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు సర్వేనెంబర్ 74లోని శ్రీనివాస్‌నగర్ కాలనీకి చెందిన పార్కుస్థలాన్ని పరిహారం కింద గత గ్రామ పంచాయతీ తీర్మానం చేస్తూ ఓ ప్రైవేట్ వ్యక్తికి అప్పగించిందని తెలిపారు. అనంతరం తిరిగి పంచాయతీ పాలకవర్గం ఆ తీర్మానాన్ని రద్దుచేసి పార్కుస్థలాన్ని తమ ఆధీనంలోకి తీసుకుందని తెలిపారు. పార్కు అభివృద్ధికి మున్సిపాలిటీ పనులు ప్రారంభించగా సదరు వ్యక్తి న్యాయస్థానాన్ని ఆశ్రయించి అడ్డు తగులుతున్నాడని స్థానికులు ఆరోపించారు. పార్కు స్థలాన్ని కాపాడి కాలనీవాసులకు అప్పగించాలని స్థానికులు కోరారు.

విలీన గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ఘట్‌కేసర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నాయకులు చింతల యాదయ్య, సబిత, చంద్రమోహన్ ఘట్‌కేసర్ మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. విలీన గ్రామపంచాయితీలైన అవుషాపూర్, మాదారం అంకుషాపూర్, ఎదులాబాద్, మర్పల్లిగూడ, ఘనాపూర్ గ్రామపంచాయతీలు మున్సిపాలిటీలో విలీనమైనా ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని వాపోయారు. ఎక్కడ వీధి లైట్లు వెలగడం లేదని గుంతలు పడిన రోడ్లకు కనీస మరమ్మతుకు నోచుకోవడం లేదన్నారు. విలీనమైన గ్రామపంచాయితీల కార్మికులకు మున్సిపాలిటీ నుంచి జీతాలు ఇవ్వడం తప్ప మరే పనులు చేయడం లేదని వాపోయారు. తక్షణమే సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని కోరారు.

అప్రమత్తతతోనే సైబర్ మోసాలకు చెక్

● బషీరాబాద్ ఎస్ఐ శంకర్

ఇంటర్వ్యూ



బషీరాబాద్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బషీరాబాద్ ఎస్ఐ పి.శంకర్ అన్నారు. ఎస్ఐ మంగళవారం ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు. ప్రజలకు తెలియకుండానే సైబర్ నేరగాళ్లు డబ్బులు దోచుకుంటున్నారని, సెల్‌ఫోన్లలో అనవసరమైన లింకులు క్లిక్ చేయొద్దని, ఓటీపీ, పాస్‌వర్డ్‌లు ఎవరికీ చెప్పకూడదని వివరించారు.

ఆంధ్రజ్యోతి: సైబర్ నేరాలతో చాలామంది మోసపోతున్నారు. ప్రజలకు మీరిచ్చే సలహా?

ఎస్ఐ శంకర్: పట్టణాలు, గ్రామాల్లో సైబర్ నేరగాళ్ల వలలో పడి అక్షరాస్యులు, నిరక్షరాస్యులు అనే తేడాలేకుండా మోసపోతున్నారు. పోలీస్‌శాఖ తరపున ఉన్నతాధికారుల ఆదేశానుసారం ప్రజలకు కళాజాత బృందాలతో ఎప్పటికప్పుడూ అవగాహన కల్పిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన బాధితులు ముందుగా ఏం చేయాలి?

ఎస్ఐ శంకర్: సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడిన వారు వెంటనే 1930టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి వివరాలు తెలిపితే 24 గంటల్లో డబ్బులు తిరిగి వచ్చే అవకాశం ఉంటుంది.

ఆంధ్రజ్యోతి: బషీరాబాద్‌లో నేరాల నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్ఐ శంకర్: సరిహద్దు గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే మండల వ్యాప్తంగా 85సీసీ కెమెరాలున్నాయి. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటునే పోలీసుల గస్తీ పెంచుతాం.

ఆంధ్రజ్యోతి: డ్రంకెన్ డ్రైవ్ కేసుల నియంత్రణకు ఏం చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్ఐ శంకర్: నిత్యం చిన్న, పెద్ద వాహనాల తనిఖీలు చేపడుతున్నాం. మద్యం తాగి ఎవరైనా పట్టుబడితే డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు పెట్టి జైలుకు పంపిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: గ్రామాల్లో బెల్ట్‌షాపుల్లో మద్యం సేవించి కొందరు రాత్రుల్లో తిరుగుతూ గొడవలు సృష్టిస్తున్నారనే వార్తలొస్తున్నాయి. మీరెలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్ఐ శంకర్: మాదృష్టికి రాలేదు. మద్యం తాగి గొడవలకు పాల్పడినా, ఎవరినైనా ఇబ్బందులకు గురిచేసినట్లు ఫిర్యాదులు వస్తే తప్పకుండా కఠినంగా వ్యవహరిస్తాం.

అభివృద్ధి పనులకు రూ.2.30కోట్లు



మాట్లాడుతున్న నాగారం మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

కీసర రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నాగారం మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకుగాను రూ.2.30కోట్లను కేటాయిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి తెలిపారు. నాగారం మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాగారం పంచాయతీ నుంచి మున్సిపల్‌గా మారిన అనంతరం తొలిసారిగా ఏర్పాటైన తొలి పాలకవర్గం ఆయా వార్డుల్లో మౌలిక వసతుల కల్పనకు కృషిచేసినట్లు వెల్లడించారు. కోట్లాది రూపాయలు వెచ్చించి కాలనీల్లో సీసీరోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను చేపట్టినట్లు వివరించారు. నాగారం మున్సిపాలిటీలోని 20వార్డుల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకుగాను రూ.2.30కోట్లను కేటాయిస్తూ కౌన్సిల్ ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ మల్లేష్ యాదవ్, కమిషనర్ భాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేద్దాం



సమావేశంలో పాల్గొన్న చైర్మన్, సభ్యులు

బషీరాబాద్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చెద్దామని బషీరాబాద్ ఏఎంసీ చైర్మన్ జి.మాధవ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఏఎంసీ కార్యాలయంలో మంగళవారం పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ పలు అంశాలపై సభ్యులతో చర్చించారు. మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్మించిన గోదాం వద్ద ప్రహరీ నిర్మాణం, పరిపాలన పక్కా భవన నిర్మాణానికి పాలకవర్గంతో కలిసి తీర్మానం చేశారు. ఈ కాపీని ఆశాఖ ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో వ్యవసాయ మార్కెట్ కమిటీ ద్వారా వ్యాపారులు రైతుల ధాన్యం క్రయవిక్రయాలు జరిపేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వానికి ఈ సమావేశంలో వైస్ చైర్మన్ చందర్‌నాయక్, పాలకవర్గం సభ్యులు వడ్డే హన్మంతు ఎస్.నరేష్, మూనీర్ అహ్మద్, అనూఫ్, మహేందర్ రెడ్డి, కొవ్వూరు నరేష్, ఎస్.వనమాల పాల్గొన్నారు.

రూ.30లక్షలతో సీసీ రోడ్డు పనులు

మేడ్చల్ టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వార్డు ప్రజల సౌకర్యార్థం రూ.30లక్షలతో సీసీరోడ్డు నిర్మిస్తున్నామని మేడ్చల్ మున్సిపల్ 6వ, వార్డు కౌన్సిలర్ మణికంఠగౌడ్ తెలిపారు. తన వార్డులో మంగళవారం సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వార్డు అభివృద్ధికి నిధులు కేటాయించి సమస్యలు పరిష్కరించామన్నారు. పాత పట్టణంలోని 6వ వార్డు పరిధిలోని కింది బస్తీ ప్రాంతంలోని అన్ని ప్రాంతాల్లో సీసీ రోడ్లు, అంతర్గత డ్రైనేజీ పనులు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మోనార్క్, సంతోష్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీఐ రక్షక్ హ్యూమన్ సొసైటీ మండల అధ్యక్షుడిగా మహ్మద్ అజర్

మేడ్చల్ టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆర్టీఐ రక్షక్ హ్యూమన్ రైట్స్ మేడ్చల్ మండల అధ్యక్షుడిగా మహ్మద్ అజర్ నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర అధ్యక్షుడు ఎ.మహేందర్‌గౌడ్ నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అజర్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై పోరాడటానికి తాము ఎల్ల వేళలా సిద్ధంగా ఉంటామన్నారు. ప్రజలకు న్యాయం చేకూర్చడానికి తమ సంస్థ పనిచేస్తుందన్నారు.

కళాకారులకు సన్మానం

బొంరాస్‌పేట్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జానపద కళాకారుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో కళాకారులను సన్మానించారు. సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రమణాచారి, వంగ శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులను సన్మానించారు. వికారాబాద్ జిల్లా నుంచి బొంరాస్‌పేట్ మండలంలోని రేగడిమైలారం గ్రామానికి చెందిన సంఘం గౌరవ అధ్యక్షుడు అంజిలప్ప, లలిత, ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య, విజయలక్ష్మి దంపతులను సన్మానించి రూ.2వేల చొప్పున నగదు పురస్కారం అందజేశారు.

విద్యార్థుల విహారయాత్ర

బషీరాబాద్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీవన్గి జడ్పీఉన్నత పాఠశాల విద్యార్థులు సోమవారం రాత్రి విజ్ఞాన విహార యాత్రకు భద్రాచలం వెళ్లారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ జి.మాధవరెడ్డి విద్యార్థులకు వీడ్కోలు పలికి ఉపాధ్యాయులకు రూ.5వేలు అందజేశారు.

ఆధార్ కేంద్రంపై ఫిర్యాదు

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆధార్‌కేంద్రంలో అధిక డబ్బులు వసూలు చేస్తున్నారని కట్ట హరినాథ్ రెడ్డి అనే వ్యక్తి మంగళవారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశాడు. ఆధార్‌కార్డులో మొబైల్‌నెంబర్ మార్చడానికి రూ.50 అయితే రూ.100లు వసూలు చేస్తున్నారని తెలిపాడు.

దేశానికి అన్నం పెట్టే రైతులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న ఏనుగు సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): దేశానికి అన్నంపెట్టే రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలని మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఎదులాబాద్‌లోని రైతు వేదికలో మంగళవారం ఏర్పాటు చేసిన ఎదులాబాద్ సమన్వయ సహకార పొదుపు సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వాలు అన్ని రకాలుగా కృషిచేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫసల్‌బీమా, భూసారపరీక్షల కార్డులను రైతులకు అందజేయాలన్నారు. రైతులు ఎరువుల వాడకం తగ్గించి, సేంద్రియ ఎరువులు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు సంజీవరెడ్డి, శంకరప్ప, మాజీ ఎంపీటీసీ సభ్యుడు గట్టగల్ల రవి పాల్గొన్నారు.

వెన్నెల గద్దర్‌ను కలిసిన పరిగి నాయకులు



వెన్నెలగద్దర్‌ను సన్మానిస్తున్న నాయకులు

పరిగి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారధి చైర్మన్ వెన్నెలగద్దర్‌ను మంగళవారం మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు బి.వెంకటయ్య ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ.. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఆశయసాధక కృషి చేయాలన్నారు. కేంద్రహోంమంత్రి అమిత్‌షా అంబేడ్కర్‌ను హేళనచేసే విధంగా మాట్లాడడం సిగ్గుచేటన్నారు. వెన్నెలగద్దర్‌ను కలిసినవారిలో అంబేడ్కర్ విజ్ఞానవేదిక జిల్లా కార్యదర్శి బి.శ్రీనివాస్, మాలయువసేన అధ్యక్షుడు రాజేందర్, నాయకులు కోళ్ల యాదయ్య, రాములు పాల్గొన్నారు.